# కొత్తగడి టీఎస్ డబ్ల్యూ ఆర్ ఎస్ బాలికల గురుకుల పాఠశాలను తనిఖీ చేసిన కలెక్టర్

- విద్యార్థులు మధ్యలోనే టీసీలు తీసుకోవడం పై ఆగ్రహం
- సమగ్ర విచారణ ఇవ్వాలని సంబంధిత అధికారులకు ఆదేశం
- నాణ్యత పై నిర్లక్ష్యం వహిస్తే సహించం
- వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారి



**వికారాబాద్, రాజముద్ర న్యూస్:** వికారాబాద్ జిల్లా పరిధిలోని కొత్తగడి టీఎస్ డబ్ల్యూ ఆర్ ఎస్ బాలికల గురుకుల పాఠశాలను వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లా కలెక్టర్ టీఎస్ డబ్ల్యూ ఆర్ ఎస్ బాలికల గురుకుల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లాలోని టీఎస్ డబ్ల్యూ ఆర్ ఎస్ గురుకుల పాఠశాల, కళాశాలపై అధిక సంఖ్యలో ఫిర్యాదులు అందుతున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో నేరుగా మాట్లాడిన కలెక్టర్, పలువురు విద్యార్థులు టీసీలు ఎందుకు తీసుకున్నారని ప్రశ్నిస్తూ ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులు మధ్యలోనే చదువు మానేయడం లేదా ఇతర విద్యాసంస్థలకు వెళ్లే పరిస్థితులు ఎందుకు ఏర్పడ్డాయో సమగ్రంగా సమాచారం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థుల ప్రవేశాలు, హాజరు, డ్రాపౌట్‌లు, టీసీల జారీకి సంబంధించిన రిజిస్టర్ లను పరిశీలించారు. విద్యార్థుల సంక్షేమం, నాణ్యమైన విద్య, వసతి, భోజనం తదితర అంశాల్లో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని స్పష్టం చేశారు. గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించడం, వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించడం అధికారుల బాధ్యత అని కలెక్టర్ పేర్కొన్నారు. ఫిర్యాదులకు కారణమైన అంశాలపై సమగ్ర విచారణ చేపట్టి, బాధ్యులపై అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పాఠశాలలో విద్యార్థినులకు అందుతున్న విద్య, వసతి, ఆహార నాణ్యత, పారిశుద్ధ్యం, తాగునీటి సౌకర్యాలు, హాస్టల్, వంటశాల, తరగతి గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో మమేకమై వారి విద్యాభ్యాసం, ఆరోగ్యం, వసతి, మెనూ ప్రకారం భోజనం ఉండాలని,భోజన నాణ్యతపై ఆరా తీశారు. కిచెన్, స్టోర్ రూమ్, టాయిలెట్స్, పరిశీలించారు. ప్రభుత్వం కల్పిస్తున్న అన్ని సౌకర్యాలు ప్రతి విద్యార్థినికి అందేలా అధికారులు, సిబ్బంది నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. విద్యార్థినులకు నాణ్యమైన విద్యతో పాటు పరిశుభ్రమైన, సురక్షితమైన వాతావరణం కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఇంటర్ రెండవ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు లెక్చరర్ గా మారి లెక్కలు బోధించి వారితో సమాధానాలు చెప్పించారు. పాఠశాలలో ఎలాంటి లోపాలు ఉన్నా వెంటనే పరిష్కరించి, విద్యార్థినులకు మెరుగైన సౌకర్యాలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ తనిఖీలో ట్రైని కలెక్టర్ సచిన్ బస్వరాజ్ గుట్టుర్, కళాశాల ప్రిన్సిపాల్ సాయి లత, ఎస్సి వెల్ఫేర్ అధికారి జయపాల్ రెడ్డి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

# నేలకొండపల్లిలో ఫుడ్ సేఫ్టీ సోదాలు

**3 ప్రముఖ బేకరీల్లో తనిఖీలు**
**- నాణ్యతపై ప్రత్యేక దృష్టి**



**ఖమ్మం రాజముద్ర న్యూస్:** నేలకొండపల్లి: ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఖమ్మం జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారులు గురువారం నేలకొండపల్లి పట్టణంలోని పలు బేకరీలు, స్వీట్ షాపులపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి శరత్ నేతృత్వంలోని బృందం తొలుత సుగుణ బేకరీ లో గంటకు పైగా సోదాలు నిర్వహించింది. బేకరీలో తయారీ, నిల్వ, పరిశుభ్రత ప్రమాణాలను పరిశీలించి చిరుతిండ్లు, స్వీట్ల శాంపిల్స్ ను సేకరించి పరీక్షలకు పంపారు. అనంతరం శివసాయి బేకరీ, అయ్యంగారు బేకరీ లలోనూ ఇదే తరహాలో తనిఖీలు చేశారు. ఫుడ్ లైసెన్స్, ఉత్పత్తుల తయారీ తేదీలు, గడువు తేదీలు, ఉపయోగిస్తున్న ముడి సరుకుల నాణ్యతను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు.అధికారుల సోదాలతో నేలకొండపల్లి సెంటర్ లో ఉద్రిక్తత నెలకొంది. తనిఖీల నేపథ్యంలో పలు హోటళ్లు, కిరాణా, స్వీట్ షాపుల యజమానులు ముందు జాగ్రత్తగా తమ దుకాణాలు మూసివేశారు. దీంతో సెంటర్ లో స్వల్పంగా బంద్ వాతావరణం కనిపించింది. ఈ సందర్భంగా ఫుడ్ సేఫ్టీ అధికారి శరత్ మాట్లాడుతూ, ప్రజలకు నాణ్యమైన ఆహారం అందేలా చూసేందుకే ఈ తనిఖీలు చేస్తున్నామన్నారు. ప్రతి నెలా ఇలాంటి తనిఖీలు కొనసాగిస్తామని, నిబంధనలు ఉల్లంఘించి కల్తీ లేదా నాణ్యత లేని ఆహార పదార్థాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.సేకరించిన శాంపిల్స్ ల్యాబ్ రిపోర్ట్ వచ్చిన తర్వాత తదుపరి చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.

## ఉస్మానియా దూరవిద్య కేంద్రంలో ప్రవేశాల సందడి.. సెప్టెంబర్ 11 వరకు దరఖాస్తులు




**ఉప్పల్, ఆగస్టు 7 ( రాజముద్ర న్యూస్):** ఉన్నత విద్యను కొనసాగించాలని భావిస్తున్న విద్యార్థులు, ఉద్యోగులకు ఉస్మానియా విశ్వవిద్యాలయం పరిధిలోని ప్రొఫెసర్ జి. రామ్ రెడ్డి దూరవిద్యా కేంద్రం (పీజీఆర్ఆర్సీడీఈ) శుభవార్త అందించింది. 2026–27 విద్యా సంవత్సరానికి సంబంధించి పలు డిగ్రీ, పీజీ, డిప్లొమా, సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశాల కోసం ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కేంద్ర డైరెక్టర్ వెల్లడించారు. ఈ విద్యా సంవత్సరంలో ఎంబీఏ, ఎంసీఏ, ఎంఏ, ఎంకాం, ఎంఎస్సీ (గణితం, గణాంక శాస్త్రం), బీఏ, బీకాం, బీబీఏ వంటి కోర్సులతో పాటు అడ్వాన్స్‌డ్ డిప్లొమా, వేద జ్యోతిష్యంలో అడ్వాన్స్‌డ్ పీజీ డిప్లొమా, యోగా సర్టిఫికెట్ కోర్సులు, పలు ఇతర సర్టిఫికెట్ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. యూజీసీ–డిస్టెన్స్ ఎడ్యుకేషన్ బ్యూరో (డీఈబీ) నిబంధనలకు అనుగుణంగా ఓపెన్ అండ్ డిస్టెన్స్ లెర్నింగ్ (ఓడీఎల్) విధానంలో ఈ ప్రవేశాలు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు. కోర్సుల వారీగా అర్హతలు వేర్వేరుగా ఉండటంతో అభ్యర్థులు ముందుగా పూర్తి వివరాలను పరిశీలించాలని సూచించారు. ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియ ఇప్పటికే ఆగస్టు 1న ప్రారంభమైందని, సెప్టెంబర్ 11 వరకు దరఖాస్తులను స్వీకరిస్తామని పేర్కొన్నారు. ప్రవేశాలు పొందిన విద్యార్థులకు అక్టోబర్ 15 నుంచి ఆన్‌లైన్ కాంటాక్ట్ తరగతులు ప్రారంభం కానున్నాయి. ఉద్యోగం చేస్తూనే ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే వారు, రెగ్యులర్ కళాశాలలకు హాజరు కాలేని విద్యార్థులకు ఈ దూరవిద్యా కోర్సులు మంచి అవకాశంగా నిలుస్తాయని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు. కోర్సుల అర్హతలు, ఫీజులు, బోధనా మాధ్యమం, సిలబస్, అకడమిక్ క్యాలెండర్, ప్రవేశ విధానం తదితర పూర్తి వివరాలను అభ్యర్థులు అధికారిక వెబ్సైట్ ద్వారా తెలుసుకోవచ్చును

# ఖమ్మం కార్పొరేషన్‌పై గులాబీ గర్జన

## అవినీతి, అక్రమాలపై విచారణ జరపాలని బి ఆర్ ఎస్ డిమాండ్



**ఖమ్మం రాజముద్ర న్యూస్:** ఖమ్మం, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌లో అవినీతి, అక్రమాలు విచ్చలవిడిగా పెరిగిపోయాయని, ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ బి ఆర్ ఎస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం కార్పొరేషన్ కార్యాలయాన్ని ముట్టడించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు కార్పొరేషన్ గేటు ముందు ధర్నా చేసి, ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేశారు. అనంతరం డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్ కు వినతిపత్రం అందజేసి, నగర సమస్యలపై తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బి ఆర్ ఎస్ మాజీ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, ఆర్జేసీ కృష్ణ, కర్నాటి కృష్ణ, బచ్చు విజయ్ కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఖమ్మం కార్పొరేషన్ అవినీతికి అడ్డాగా మారిందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో లంచాలు తీసుకుంటూ అధికారులు పట్టుబడిన ఘటన దీనికి నిదర్శనమని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాల్సింది పోయి నాయకులు, అధికారులు కుమ్మక్కు అవుతున్నారని విమర్శించారు.డీజిల్ వినియోగంలో భారీ అక్రమాలు జరుగుతున్నాయని ఆరోపించారు. వినియోగంలో లేని వాహనాల పేర్లతో డీజిల్ తీసుకుని దుర్వినియోగం చేస్తున్నారని, దీనిపై స్వతంత్ర సంస్థతో విచారణ జరిపి బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కోరారు.బి ఆర్ ఎస్ హయాంలో ప్రజల సౌకర్యార్థం నిర్మించిన పబ్లిక్ టాయిలెట్లు, షాపింగ్ కాంప్లెక్స్‌ల నిర్వహణను పారదర్శక టెండర్ల ద్వారా చేపట్టామని గుర్తు చేశారు. అయితే ప్రస్తుత ప్రభుత్వం ఆ విధానాన్ని మార్చి తమ అనుచరులకు షాపులు కేటాయిస్తోందని ఆరోపించారు.నగరంలో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉందని, డ్రైనేజీలు శుభ్రం చేయక పోవడంతో మురుగునీరు రోడ్లపైకి వస్తోందని చెప్పారు. తాగునీరు, వీధి దీపాలు, రోడ్లు, పార్కుల నిర్వహణ, అక్రమ నిర్మాణాల పై కూడా అధికారులు దృష్టి సారించాలని డిమాండ్ చేశారు.ప్రజా సమస్యలు పరిష్కరించకపోతే నగర ప్రజలను సమీకరించి మరింత పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని బి ఆర్ ఎస్ నాయకులు హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఖమర్, ఆంధ్ర బ్యాంక్ మాజీ చైర్మన్ బి.రెడ్డి నాగచంద్రారెడ్డి, మాజీ డిప్యూటీ మేయర్ బత్తుల మురళి, మాజీ కార్పొరేటర్లు షేక్ మక్బూల్, తోట రామారావు, మాటేటి నాగేశ్వరావు, శీలంశెట్టి వీరభద్రం, పల్లా రోజ్ లీనా తదితర బి ఆర్ ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వికారాబాద్ కలెక్టర్ కార్యాలయంలో ఘనంగా ప్రొఫెసర్ జయ శంకర్ జయంతి




**వికారాబాద్, రాజముద్ర న్యూస్:** తెలంగాణా సిద్ధాంత కర్తగా పేరు పొందిన ప్రొఫెసర్ జయశంకర్ ఆశయాలను ప్రతి ఒక్కరు పాటించాలని వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. గురువారం వికారాబాద్ కాల్లెక్ట్రేట్ కార్యాలయ సమావేశము హాలు నందు ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి జిల్లా కలెక్టర్, అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ బస్వరాజ్ గుట్టుర్ లతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రొఫెసర్ జయ శంకర్ జయంతి వేడుకలు పురష్కరించుకొని వారి యొక్క సేవలను కొనియాడారు. తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ బాషలలో మంచి ప్రావీణ్యం ఉన్న జయశంకర్ తెలంగాణా ఉద్యమానికి తన జీవితాన్ని అంకితం చేశారన్నారు. తెలంగాణా ఆవశ్యకతను ప్రపంచానికి చాటి చెప్పిన మహోన్నత వ్యక్తి అని , తెలంగాణా ఉద్యమ సిదంతా కర్త అని వారి ఉద్యమ స్ఫర్తిని, సేవలను కొనియాడారు. జయశంకర్ కలలుగన్న తెలంగాణ మనకు సిద్ధించిందని ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరు తూచ తప్పకుండా పాటించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డి ఆర్ ఓ స్వర్ణలత, వెనుకబడిన తరగతుల అబివృద్ధి అధికారి మాధవ రెడ్డి, జయపాల్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, జిల్లా అధికారులు, కలెక్టరేట్ కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు 'సన్న' భరోసా - దేశంలోనే ఫస్ట్ తెలంగాణ

**ఈశ్వరమాదారంలో 3 నెలల ఉచిత సన్న బియ్యం పంపిణీ ప్రారంభం**



**కూసుమంచి:** పేదల ఆహార భద్రత కోసం రాష్ట్ర ప్రభుత్వం ఉచిత సన్న బియ్యం పంపిణీని ప్రారంభించింది. దేశంలో ఉచితంగా సన్న బియ్యం ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. గురువారం ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం ఈశ్వరమాదారం గ్రామంలో జిల్లా కలెక్టర్ దివాకర్ తో కలిసి లబ్ధిదారులకు 3 నెలల సన్న బియ్యాన్ని మంత్రి పంపిణీ చేశారు. ప్రతి కార్డుకు నెలకు 6 కిలోల చొప్పున ఉచితంగా ఇస్తున్నామని తెలిపారు.గతంలో దొడ్డు బియ్యం రీసైక్లింగ్ కు గురై ప్రభుత్వ ధనం వృథా అయ్యేదని, ఇప్పుడు ఇస్తున్న సన్న బియ్యాన్ని లబ్ధిదారులే స్వయంగా వినియోగిస్తున్నారని మంత్రి చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేదలకు భరోసా ఇవ్వడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. "ఇప్పుడు ఇచ్చే బియ్యం చాలా బాగుంది, ఇంట్లోనే వండుకుంటున్నాం" అని లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, డిఎస్ఓ చందన్ కుమార్, ఆర్డీఓ శ్రీనివాస్, తహసీల్దార్ సైదులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## క్షయవ్యాధి నిర్మూలన ఒప్పంద ల్యాబ్ టెక్నీషియన్ల అభ్యంతరాలు ఉంటే తెలపాలి

**వికారాబాద్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కె సుధాకర్ లాల్**

**వికారాబాద్, రాజముద్ర న్యూస్:** వికారాబాద్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో జాతీయ క్షయ వ్యాధి నిర్మూలన కార్యక్రమం క్రింద ఒప్పంద ప్రాతిపదికన ల్యాబ్ టెక్నీషియన్, సూపర్వైజర్ పోస్టుల కొరకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల ప్రొవిజినల్ జాబితా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ప్రదర్శించబడినదని వికారాబాద్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కె సుధాకర్ లాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వివరాలను వెబ్ సైట్ www.vikarabad.telangana.gov.in లో పొందుపరచడమైనది. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఏవైనా అభ్యంతరాలు ఉన్నట్లయితే నేటి నుండి 10.8.2026 సాయంత్రం ఐదు గంటల లోపు అభ్యంతరాలను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో తెలియచేయాల్సిందిగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కే సుధాకర్ లాల్ తెలిపారు. సెలవు దినములలో కూడా ఆఫీసు పనివేళల యందు అభ్యంతరాలను తెలియజేయవచ్చని తెలిపారు.

## ఘనంగా వేముల మోహన్ కృష్ణ జన్మదిన వేడుకలు



**సూర్యాపేట, రాజముద్ర న్యూస్:** ప్రముఖ సామాజిక సేవకుడు వేముల మోహన్ కృష్ణ జన్మదినాన్ని పురస్కరించుకుని సూర్యాపేట పట్టణంలోని కొత్త బస్టాండ్ అండర్‌పాస్ వద్ద వేముల పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో ఘనంగా సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 250 మంది ప్రయాణికులు, నిరుపేదలు, వృద్ధులు, కార్మికులు అవసరమైన వారికి బిర్యానీ ప్యాకెట్లు, వాటర్ బాటిళ్లు, అరటి పండ్లు పంపిణీ చేసి మానవతా చాటుకున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, జన్మదిన వేడుకలను ఆడంబరంగా నిర్వహించడం కంటే సమాజంలో అవసరమైన వారికి సహాయం చేయడం ఎంతో గొప్ప విషయమని అన్నారు. ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడం మహాదానమని, అదే భావనతో ఈ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజంలో సేవా స్ఫూర్తిని పెంపొందిస్తాయని, యువత కూడా సామాజిక సేవలో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పాల్గొన్న వారు వేముల మోహన్ కృష్ణ హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆయన ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో, దీర్ఘాయుష్షుతో ప్రజాసేవలో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సేవా కార్యక్రమాలు చేపడుతున్న ఆయన సేవాభావం ఆదర్శప్రాయమని కొనియాడారు. సమాజంలో ఆకలితో ఉన్నవారికి అండగా నిలవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, యువకులు, స్థానిక ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

